10-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ అపవిత్ర (పతిత) భారత్ ను పవిత్రంగా (పావనంగా) తయారుచేసే సేవలో ఉండాలి, విఘ్నాలను తొలగించుకోవాలి, నిరాశ పడకూడదు"

ప్రశ్న:- గృహస్థ వ్యవహారములో ఉంటూ ఏ స్మృతిలో ఉండడము చాలా అవసరము?

జవాబు:- గృహస్థ వ్యవహారములో ఉంటూ మేము ఈశ్వరీయ విద్యార్థులము అని స్మృతి ఉండాలి. విద్యార్థికి చదువు మరియు టీచరు సదా గుర్తుంటారు. వారు ఎప్పుడూ నిర్లక్ష్యముతో తమ సమయాన్ని వ్యర్థం చేసుకోరు, వారికి సమయం అంటే చాలా విలువ ఉంటుంది.

ప్రశ్న:- మనుష్యుల్లో అన్నింటికన్నా అతి పెద్ద అజ్ఞానం ఏమిటి?

జవాబు:- ఎవరి పూజనైతే చేస్తారో, వారినే నామ రూపాలకు అతీతమైనవారు అని అంటారు - ఇది అన్నింటికన్నా అతి పెద్ద అజ్ఞానము. పిలుస్తారు, మందిరాలను నిర్మించి పూజిస్తారు, మరి వారు నామ రూపాలకు అతీతమైనవారు ఎలా అవ్వగలరు. మీరు అందరికీ పరమాత్మ యొక్క సత్య పరిచయాన్ని ఇవ్వాలి.

గీతము:- బాల్యపు రోజులను మరచిపోకూడదు...(బచ్పన్ కే దిన్ భులా నా దేనా...)

ఓంశాంతి. అనంతమైన తండ్రి పిల్లలకు శిక్షణనిచ్చారు లేక అప్రమత్తం చేసారు, రామునికి చెందినవారిగా అయినప్పుడు ఈ బాల్యాన్ని అనగా ఈశ్వరీయ బాల్యాన్ని మరచిపోకూడదు. రాముని బాల్యము నుండి పక్కకు తప్పుకొని రావణుని వైపుకు వెళ్ళిపోవడము, ఇలా కూడా ఉండకూడదు. అలా చేస్తే చాలా-చాలా పశ్చాత్తాప పడవలసి వస్తుంది. ఈ విషయం కూడా అర్థం చేయించారు, ఒకవేళ మహాన్ మూర్ఖులను చూడాలి అంటే ఇక్కడే చూడండి, వారు చదువును వదిలేస్తారు. మరి వారి గతి ఏమవుతుందో మీరు అర్థం చేసుకోగలరు. ఇక్కడి మహారథులు గజము వంటివారు, వారిని కూడా మొసలి రూపీ మాయ తినేస్తుంది. తండ్రి సమ్ముఖముగా కూర్చుని అర్థం చేయిస్తారు - మధురాతి-మధురమైన చాలా కాలం క్రితం విడిపోయి ఇప్పుడు కలిసిన ప్రియమైన పిల్లలూ, మాయ చాలా శక్తివంతమైనది. అనంతమైన తండ్రి చేతిని విడిచిపెట్టేలా ఎప్పుడూ కూడా ఉండకూడదు. వీరు పరమపిత పరమాత్మ, ఎంతో దూరముగా ఉండే తండ్రి, పతిత-పావనుడు. ఇటువంటి తండ్రి చేతిని ఎప్పుడూ విడిచిపెట్టకూడదు. లేదంటే చాలా ఏడ్వవలసి వస్తుంది. చాలా మంచి-మంచి పిల్లలు ఎవరికైతే బాబా పెద్ద-పెద్ద టైటిళ్ళను ఇస్తారో, వారు కూడా చేతిని విడిచిపెట్టేస్తారు. ఎక్కడా పడిపోకూడదు అని బాబా కొందరిని ఎక్కువగా ప్రేమిస్తారు. పాట కూడా గాయనం చేయబడినది. మాయ మిమ్మల్ని ఈడ్చుకుని వెళ్ళేలా ఉండకూడదు, అలా అయితే చాలా పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. వాస్తవానికి సత్యాతి-సత్యమైన యుద్ధం మీదే, మీరు మాయపై విజయాన్ని పొందుతారు.

ఇప్పుడు మీరు అపవిత్రము నుండి పవిత్రంగా అయ్యారు. పతిత స్థానాన్ని మీరు పావన స్థానంగా తయారుచేస్తారు. పవిత్ర స్థానమైతే ఇక్కడ లేదు. ఈ సమయంలో మొత్తం ప్రపంచము అపవిత్ర స్థానముగా ఉంది. పావనమైనవారు దేవీ-దేవతలు. మీరు అపవిత్ర (పతిత) భారత్ ను పావనంగా చేస్తున్నారు. అపవిత్రులను పవిత్రంగా చేసేందుకే ఈ ప్రదర్శినీ మొదలైనవి చేస్తారు. మీరు భారత్ కు సత్యమైన సేవను చేస్తారు కదా. అయితే, విఘ్నాలను కూడా తొలగించుకోవాల్సి ఉంటుంది, ఇందులో హార్ట్ ఫెయిల్ అవ్వకూడదు లేక సోమరులుగా అవ్వకూడదు. ఎటువంటి పరిస్థితిలోనూ పతితులను పావనంగా తయారుచేసే సేవను తప్పకుండా చేయాలి. మీ వ్యాపారమే ఇది, ఇంకే విషయాలతోనూ మీకు సంబంధం లేదు. నేను ఎంతమందిని అపవిత్రము నుండి పవిత్రముగా చేసాను అని చూసుకోవాలి. ఈ భారత్ స్వర్గంగా ఉండేది, పావన ప్రపంచముగా ఉండేది. ఈ సమయంలో అపవిత్రత మరియు పవిత్రత యొక్క జ్ఞానం ఎవ్వరికీ లేదు. కొత్త ప్రపంచమే పవిత్ర స్థానము, మళ్ళీ పాతదిగా అవ్వడముతో అపవిత్రముగా, పతితముగా, తమోప్రధానముగా అయిపోతారు.

కావున ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు సమ్ముఖములో అర్థం చేయిస్తారు. ఇప్పుడు మీ బుద్ధిలో ఉంది, తప్పకుండా మనం పవిత్ర స్థానాన్ని స్థాపన చేస్తున్నాము. భారత్ పవిత్ర స్థానముగా ఉండేది, ఇప్పుడు అపవిత్ర స్థానముగా అయ్యింది. ఇల్లు కొత్తదిగా ఉంది, మళ్ళీ పాతదిగా తప్పకుండా అవుతుంది. ఈ వివేకం కొత్త ప్రపంచములో ఉండదు. ఇప్పుడు పిల్లలైన మీకు వివేకం లభించింది. లక్షల సంవత్సరాలు అనైతే అంటారు, చివరికి పాతదిగా అయితే

అవుతుంది కదా. పాతది అన్న పేరు కలియుగానికే ఉంటుంది. నవ యుగము మరియు పాత యుగము గురించి కేవలం మీకు తెలుసు. ఇప్పుడు నవ యుగము వస్తుంది. మనం పవిత్రంగా అయి స్వరాజ్యాన్ని పొందేందుకు మళ్ళీ ఈ జ్ఞానాన్ని తండ్రి ద్వారా తీసుకుంటున్నాము. విద్యార్థులు ఎప్పుడైనా చదువును మరియు టీచరును మర్చిపోగలరా? మీరు కూడా విద్యార్థులు, గృహస్థ వ్యవహారములో ఉంటూ మేము చదువుకుంటున్నాము అని గుర్తుండాలి. ఈ చదువులో చాలా సమయం పడుతుంది. మధ్యలో కొందరు పడిపోతారు, కొందరు ఓడిపోతారు. నోటితో అంటారు, శివబాబా కేరాఫ్ బ్రహ్మ అని రాస్తారు కూడా. తండ్రికి ఎంతో ప్రేమతో ఉత్తరం వ్రాస్తారు, జీవాత్మలమైన మేము పరమపిత పరమాత్మకు ఉత్తరం వ్రాస్తున్నాము. ఓ పరమాత్మ రక్షించండి, శాంతినివ్వండి అని వారు పిలుస్తున్నారు. తండ్రి తప్ప ఎవ్వరూ శాంతినివ్వలేరు. బాబా అయితే రావాల్సిందే. భక్తుల రక్షకుడు అని కూడా అంటూ ఉంటారు. జీవన్ముక్తిని ఇవ్వండి, శాంతిని ఇవ్వండి, ముక్తులను చేయండి, మేము జీవిస్తూనే ముక్తులవ్వాలి అని అంటారు. అలాగైతే సత్యయుగములోనే ఉంటారు. ఇక్కడైతే జీవన బంధనం ఉంది. ఈ విషయాలను మీరు బాగా అర్థం చేసుకుంటారు మరియు స్వయం తండ్రి అర్థం చేయిస్తున్నారు, ఇంకెవ్వరి బుద్ధిలోనూ డ్రామా రహస్యం లేదు. మూడు కాలాల గురించి, ఆది మధ్యాంతాల గురించి ఎవ్వరికీ తెలియదు. మీకు అన్నీ తెలుసు కానీ సాధారణముగా, గుప్తముగా ఉన్నారు, వారు బయటకు వెళ్ళి భౌతికమైన డ్రిల్లును చేస్తారు, నేర్చుకుంటారు. మీ డ్రిల్లు ఆత్మికమైనది. వీరు యోధులు, యుద్ధం చేసేవారు అని ఎవ్వరికీ తెలియనే తెలియదు. మహాభారత యుద్ధాన్ని చూపిస్తారు, అది ఎలా జరిగింది? మహాభారత యుద్ధాన్ని భగవంతుడు చేయించారని అంటారు. ఇప్పుడు భగవంతుడు హింసాత్మకమైన యుద్ధాన్ని ఎలా చేయిస్తారు. భగవంతుడు రావణుడిపై విజయాన్ని పొందేందుకు యుద్ధం నేర్పించారు. మీరు 16 కళల సంపూర్ణులుగా ఉండేవారని అర్థం చేయిస్తారు. మీరు మూలవతనము నుండి అశరీరిగా వచ్చారు, మళ్ళీ ఇక్కడ వస్త్రాన్ని ధారణ చేసి మొదట సత్యయుగములో రాజ్యం చేసారు. స్మృతిలోకి వస్తుంది కదా? అవును బాబా, ఇప్పుడు మాకు స్మృతి కలిగింది, తప్పకుండా మేము దైవీ రాజ్యానికి యజమానులుగా ఉండేవారము, మళ్ళీ ఓడిపోయాము. ఇప్పుడు మనం యుద్ధ మైదానములో నిల్చున్నాము. మాయపై విజయము తప్పకుండా పొందుతాము. కామ చితిపైకి ఎక్కడంతో మనుష్యుల ముఖము నల్లగా అయిపోతుంది. నలుపు అన్న పదము కఠినమైనది, అందుకే శ్యామము అని అంటారు. కృష్ణుడికి మరియు నారాయణుడికి నీలి రంగును చూపిస్తారు, అటువంటి మనుష్యులు ఎవ్వరూ ఉండరు. మనుష్యులైతే తెల్లగా, నల్లగా ఉంటారు. ఇనుప యుగమువారిని నలుపు అని అంటారు. లౌకిక తండ్రి కూడా, నీవు నల్ల ముఖం చేసుకొని కులానికి కళంకము తీసుకొస్తున్నావు అని అంటారు. అనంతమైన తండ్రి అంటారు, మీరు ఆసురీ మతముపై నడుస్తూ దైవీ కులాన్ని కళంకితం చేసారు, అందుకే మీరు నల్లగా అయిపోయారు. పూర్తిగా నల్లగా అవ్వడానికి అర్ధకల్పం పడుతుంది మరియు తెల్లగా అవ్వడానికి క్షణము పడుతుంది. పిల్లలకు డ్రామా ఆది మధ్యాంతాల స్మృతి కలిగింది, ఇతర ధర్మాల వారికి ఈ స్మృతి కలగదు. విస్మృతి కూడా మీకే కలిగింది, స్మృతి కూడా మీకే కలిగింది. మీరు దైవీ రాజ్య స్థానానికి యజమానులుగా ఉండేవారు. ఇక్కడ రాజులు చాలామంది ఉన్నారు, అందుకే రాజస్థాన్ అని పేరు పెట్టారు. ఇప్పుడిది పంచాయితీ రాజ్యము. ఇప్పుడు మీరు మహారాణి, మహారాజుగా అయ్యేందుకు పురుషార్థం చేస్తున్నారు. డ్రామా ప్లాన్ అనుసారముగా ఇలాగే జరిగింది. చక్రం తిరుగుతూ స్వర్గము నరకముగా అవుతుంది. ఇప్పుడు మీరు అపవిత్ర స్థానము నుండి పవిత్ర స్థానములోకి వెళ్ళి రాజ్యం చేసేందుకు పురుషార్థం చేస్తున్నారు. మీ చదువు సాధారణమైనది. అల్ఫ్ (భగవంతుడు), బే (వారసత్వాన్ని) ను స్మృతి చేయాలి. బాబా అంటారు, నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. రాజ్యాన్ని స్మృతి చేసినట్లయితే రాజ్యము లభిస్తుంది. నేను గేదెను, గేదెను... అని అనండి అని మనుష్యులు అంటారు, ఈ విషయమైతే సత్యము కాదు. ఆత్మలైన మీరంటారు మేము విష్ణువుగా అవుతాము, ఎలా అవుతారు? నన్ను స్మృతి చేయండి మరియు విష్ణుపురి అయిన రాజధానిని కూడా స్మృతి చేయండి అని బాబా అంటారు. ప్రవృత్తి మార్గం అయిన కారణంగా విష్ణువు యొక్క పేరును తీసుకోవడము జరుగుతుంది. అక్కడ కూడా లక్ష్మీ-నారాయణుల సింహాసనం వెనుక విష్ణువు చిత్రం చిహ్నంగా ఉంటుంది. చిత్రాలలో కూడా ఇలా-ఇలా తయారుచేస్తారు. బాబా రహస్యాన్ని అర్థం చేయించారు - అక్కడ అటువంటి ఆచార-పద్ధతులు ఉంటాయి, మళ్ళీ ఆ లక్ష్మీ-నారాయణులు చక్రము తిరిగి బ్రహ్మ, సరస్వతులుగా లేక జగత్పిత, జగదంబలుగా అవుతారు. బ్రహ్మను గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్ అని అంటారు. శివుడిని ఫాదర్ అని అంటారు. ఆత్మలందరూ సోదరులు. గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్లుగా మనుష్యులే అవుతారు. కావున ఇప్పుడు దేహాభిమానాన్ని తొలగించి ఆత్మాభిమానిగా అవ్వాలి. ఆత్మాభిమానిగా పరమాత్మ అయిన తండ్రే తయారుచేస్తారు. ఇక్కడ మీకు డబుల్ ప్రకాశము ఉంది, జ్ఞానము ఉంది. ఆత్మాభిమానిగా కూడా అవుతారు, మళ్ళీ తండ్రిని కూడా స్మృతి చేస్తారు ఎందుకంటే వారసత్వం తీసుకోవాలి. దేవతలు పురుషార్థం చేసి పూర్వ జన్మలో తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకున్నారు. వారికి స్మృతి చేయాల్సిన అవసరము లేదు. కావున పిల్లలు కొత్త-కొత్త పాయింట్లను బుద్ధిలో ధారణ చేయాలి. యుక్తులు చాలా

లభిస్తూ ఉంటాయి. మొట్టమొదట బుద్ధిలో ఈ విషయాన్ని కూర్చోబెట్టండి, ఉన్నతోన్నతమైన స్థానము ఏమిటి? నిర్వాణధామము. ఆత్మలమైన మనం నిర్వాణధామం యొక్క నివాసులము. పరమపిత పరమాత్మ ఉన్నతోన్నతమైనవారు. వారిది ఉన్నతోన్నతమైన స్థానము. ఉన్నతోన్నతమైన నామము. ఉన్నతోన్నతమైనది వారి మహిమ. వారు రావడము కూడా భారత్ లో వచ్చారు, అందుకే ఇక్కడ స్మృతిచిహ్నం తయారయ్యింది కదా. ఎవరికైతే నామరూపాలే ఉండవో, వారిని పూజించేందుకు వారు ఎక్కడి నుండి వచ్చినట్లు. కావున ఇది కూడా పొరపాటే కదా. పరమాత్మను నామరూపాలకు అతీతమైనవారని అనడము, ఇదైతే అజ్ఞానము అయినట్లు. శివరాత్రిని కూడా భారత్ లోనే జరుపుకుంటారు. భారత్ యే ప్రాచీనముగా, సత్యయుగముగా ఉండేది, ఇప్పుడు అలా లేదు. కావున తప్పకుండా తండ్రే సత్యయుగ స్థాపనను చేసి ఉంటారు. మళ్ళీ దుఃఖాన్ని ఎవరు ఇస్తారు? ఎప్పటి నుండి మొదలవుతుంది? ఇది ఎవ్వరికీ తెలియదు. తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు. ఇప్పుడు ఆ 21 తరాల అనంతమైన వారసత్వాన్ని మీకు మళ్ళీ ఇచ్చేందుకు వచ్చాను. మీరు కల్ప-కల్పము ఈ పురుషార్థము చేసారు. అనంతమైన సుఖం యొక్క వారసత్వము, అనంతమైన తండ్రి నుండి తీసుకున్నారు, ఇప్పుడిది అంతిమ జన్మ కావున పవిత్రముగా అయి భవిష్యత్తు కోసం పూర్తి వారసత్వాన్ని ఎందుకు తీసుకోకూడదు. కనుక తప్పకుండా వారసత్వాన్ని పొందేందుకు భక్తులు భగవంతుడిని గుర్తు చేస్తారు. భగవంతుడు ఉన్నదే పతిత-పావనుడు, సద్గతి దాత. వారు నరుడి నుండి నారాయణుడిగా తయారుచేసేవారు, ఇతురులెవ్వరూ అలా తయారుచేయలేరు. సత్యయుగములో వెంటనే లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉంటుంది, మరి తప్పకుండా పూర్వ జన్మలో పురుషార్థం చేసారు అని అంటారు, అందుకే తండ్రి భవిష్యత్తులో ఇటువంటి పదవిని పొందేందుకు ఇప్పుడు మీతో పురుషార్థం చేయిస్తున్నారు. పతిత ప్రపంచం యొక్క అంతిమంలోనే వారు వచ్చి పావనంగా తయారుచేస్తారు కదా. అది నిర్వికారీ ప్రపంచము. మళ్ళీ కళలు తగ్గుతూ ఉంటాయి. ఇప్పుడు ఇది వికారీ ప్రపంచము.

తండ్రి అంటారు, ఈ పంచ వికారాలను దానమివ్వండి మరియు పవిత్రంగా అవ్వండి. స్మృతి కూడా చేయండి మరియు పవిత్రంగా కూడా అవ్వండి. పవిత్రంగా ఉండండి, రాజయోగిగా అవ్వండి. గృహస్థ వ్యవహారములో ఉంటూ ఒక్క శివబాబాను స్మృతి చేయండి మళ్ళీ ఎప్పుడైనా, ఎవరినైనా స్మృతి చేసారంటే వ్యభిచారిగా అయినట్లు. భక్తి మార్గంలో గృహస్థ వ్యవహారములో ఉంటూ కూడా ఒకసారి ఒకరిని, మరోసారి ఇంకొకరిని స్మృతి చేస్తారు. కనుక అది వ్యభిచారీ స్మృతి అవుతుంది మరియు వారు పవిత్రంగా కూడా ఉండరు, కనుక తండ్రి అంటారు, గృహస్థ వ్యవహారంలో తండ్రినైన నన్నొక్కరినే స్మృతి చేయండి. ఈ అంతిమ జన్మ నా కోసం కమల పుష్ప సమానముగా పవిత్రముగా అయి కేవలం నన్ను స్మృతి చేస్తూ ఉండండి. ఈ ఒక్క జన్మ నాకు సహాయకులుగా అవ్వండి, ఎవరైతే సహాయం చేస్తారో వారే ఫలము పొందుతారు. మీరు ఈశ్వరీయ సేవాధారిగా అయ్యారు. స్వయం తండ్రి భారత్ కు సేవ చేస్తారు కదా. తండ్రి అంటారు, పిల్లలూ, మీరు యోగ్యులుగా అవ్వాలి. గుణాలు కూడా తప్పకుండా కావాలి. ఇక్కడ గుణవంతులుగా అవ్వాలి. మళ్ళీ 21 జన్మల కొరకు దేవతలుగా అయి రాజ్యం చేస్తారు. కృష్ణుని చిత్రం చాలా బాగుంది అని బాబా అర్థం చేయించారు. నరకాన్ని కాలితో తన్నుతున్నారు, స్వర్గం చేతిలో ఉంది. భారత్ లోనే ఈ నియమము ఉంది. ఎవరైనా మరణిస్తే ముఖాన్ని ఊరి వైపు, కాళ్ళు స్మశానం వైపు పెడతారు. మళ్ళీ ఎప్పుడైతే స్మశానానికి సమీపంగా వస్తారో, అప్పుడు ముఖాన్ని తిప్పి స్మశానం వైపుకు పెడతారు. ఇప్పుడైతే మీరు జీవిస్తూనే వెళ్ళేందుకు తయారుగా ఉన్నారు, కనుక మీ ముఖము కొత్త ప్రపంచం వైపు ఉండాలి. వయా శాంతిధామం సుఖధామంలోకి వెళ్ళాలి. ఇది అనంతమైన విషయము. పాత ప్రపంచాన్ని కాలితో తన్నుతున్నారు, కొత్త ప్రపంచములోకి వెళ్తున్నారు, అందుకే దుఃఖధామాన్ని మర్చిపోవలసి ఉంటుంది. సుఖధామాన్ని మరియు శాంతిధామాన్ని స్మృతి చేయాలి. మీరు దుఃఖధామంలో ఉన్నా కానీ స్మృతి వారినే చేయండి. అవ్యభిచారీ యోగము కావాలి, ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ లేరు. చాలా సహజమైన మంచి వివరణ లభిస్తుంది. అర్జునుడు చాలా శాస్త్రాలను చదివారు, కావున ఇదంతా మర్చిపో మరియు వాటిని చదివించేవారిని కూడా మర్చిపో అని వారికి చెప్పారు. తండ్రి కూడా అలాగే చెప్తారు. ఇప్పుడు ఏదైతే విన్నారో అంతా మర్చిపోండి. నేను మీకు అన్ని శాస్త్రాల సారాన్ని అర్థం చేయిస్తాను. సత్యఖండానికి యజమానులుగా తయారుచేస్తారు. వారు మిమ్మల్ని అసత్యఖండానికి యజమానులుగా తయారుచేస్తారు. తండ్రి అంటారు, నేను రైటా లేక మీ పినతండ్రులు, మామయ్యలు లేక శాస్త్రవాదులు రైటా? ఇప్పుడు నిర్ణయించుకోండి. ఆ యుద్ధం హద్దుకు సంబంధించినది, మీది అనంతమైనది. దీని ద్వారా మీరు అనంతమైన రాజ్యాన్ని తీసుకుంటారు. తండ్రి అంటారు, ఈ వికారాలను ఇప్పుడు దానంగా ఇచ్చేయండి. ఇప్పుడు పురుషార్థం చేయకపోతే చాలా-చాలా పశ్చాత్తాపపడతారు, అందుకే నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టండి, సేవలో నిమగ్నమవ్వండి, కళ్యాణకారిగా అవ్వండి. ఈ కలియుగములో మహాన్ దుఃఖము ఉంది. ఇప్పుడైతే దుఃఖం యొక్క

పర్వతాలు చాలా పడనున్నాయి, మళ్ళీ సత్యయుగములో బంగారు పర్వతాలు నిల్చుంటాయి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అల్ఫ్ మరియు బే ను (తండ్రి మరియు వారసత్వాన్ని) స్మృతి చేసే సహజమైన చదువును చదువుకోవాలి మరియు చదివించాలి. అవ్యభిచారీ స్మృతిలో ఉండాలి. ఈ అసత్య ఖండాన్ని బుద్ధి ద్వారా మర్చిపోవాలి.

2. ఈశ్వరీయ సేవాధారులుగా అయి భారత్ ను అపవిత్రము నుండి పవిత్రముగా తయారుచేసే సేవను చేయాలి. తండ్రికి పూర్తి-పూర్తి సహాయకులుగా అవ్వాలి.

వరదానము:- ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ సదా ఎవర్రెడీగా ఉండే తీవ్ర పురుషార్థీ భవ

ఏ పిల్లలైతే తీవ్ర పురుషార్థులో, వారు ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ ఎవర్రెడీగా ఉంటారు. వారు ఇలా ఆలోచించరు ఇప్పుడైతే వినాశనం అవ్వడానికి కొంత సమయం పడుతుంది, తర్వాత తయారైపోతాము అని. ఆ అంతిమ ఘడియను చూసేందుకు బదులుగా తమ అంతిమ ఘడియకు ఎటువంటి భరోసా లేదు అనే ఆలోచించండి, అందుకే ఎవర్రెడీగా ఉండండి, మీ స్థితి సదా ఉపరామంగా ఉండాలి. అన్నింటికీ అతీతంగా మరియు తండ్రికి ప్రియంగా, నష్టోమోహులుగా ఉండండి. సదా నిర్మోహులుగా మరియు నిర్వికల్పముగా, నిర్వ్యర్థముగా ఉండాలి, వ్యర్థము కూడా ఉండకూడదు, అప్పుడే ఎవర్రెడీ అంటారు.

స్లోగన్:- నాజూకు సమయంలో పాస్ విత్ ఆనర్ గా అవ్వాలంటే సర్దుకునే శక్తిని పెంచుకోండి.